
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 31 । మే । 2024



కార్డెన్ సెర్చ్


పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కొత్తపేట పీఎస్ సీఐ షేక్ అన్వర్‌బాషా, లాలాపేట సీఐ పి.దేవప్రభాకర్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.70 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రామాలయంలో హనుమ జయంతి



సత్తెనపల్లి: సత్తెనపల్లి గడియార స్తంభం వద్ద గల కోదండ రామాలయంలో గురువారం హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ముందుగా హనుమత్ విగ్రహానికి తులసి మాలలతో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

లాసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: లాసెట్–2024కు హాజరు కానున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జాగర్లమూడి చంద్రమౌళి (జేసీ) న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకరబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, 25 ఏళ్ళుగా ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సులకు జూన్ 9న ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఇతర వివరాలకు 0863–2350330, 98485 50353 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హనుమాన్ శోభా యాత్రను జయప్రదం చేద్దాం



మంగళగిరి: జూన్ 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ శోభాయాత్రను భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్రీయ సాధు సంరక్షణ సంఘం అధ్యక్షుడు కళ్యానంద స్వామీజీ కోరారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో గురువారం హనుమాన్ శోభాయాత్ర వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ హనుమజ్జయంతి రోజు భక్తులంతా భారీగా తరలివచ్చి శోభా యాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి ప్రాతూరి నాగభూషణం, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారక్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు




గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన జాబ్ అచీవర్స్ డే కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన 16 మంది విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. పాలిటెక్నిక్ పూర్తయిన తరువాత ఉద్యోగం చేస్తూనే, ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరిన్ని ప్రముఖ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని, ప్రతి విద్యార్థికీ ఉద్యోగ కల్పన లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజాక్‌ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి కొల్లా సుస్మిత, విభాగాధిపతులు చల్లా జ్యోతిర్మయి, కర్రా దీపిక పాల్గొన్నారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 263 మంది విద్యార్థులు హాజరైనట్లు హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. శుక్రవారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 59,001 నుంచి 75 వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

విజయకీలాద్రిపై హనుమజ్జయంత్యుత్సవాలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై హనుమజ్జయంత్యుత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, మొదటిరోజు గురువారం ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం, అనంతరం మన్యుసూక్త హోమం, విశేష అలంకరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజలు, తీర్థప్రసాద గోష్టి ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, వేదవిద్యార్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కదిలిస్తే...కన్నీళ్లే

- విషాదంలో నల్లమడవాగు మృతుల కుటుంబాలు
- తండ్రులు కోల్పోయి కొందరు... బిడ్డను కోల్పోయి మరికొందరు
- ఆదర్శ కుటుంబాలను కబళించిన మృత్యువు
- మూడు కుటుంబాల్లో విషాదచాయలు
- ఏరియా వైద్యశాలలో మిన్నంటిన రోదనలు



కిరణ్‌గౌడ్ మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న భార్య లక్ష్మి, తల్లి పద్మ

బాపట్లటౌన్: వారంతా రోజువారీ కూలీలే..రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాలు వారివి..ఏడాదంతా కుటుంబ కోసం శ్రమించే వారు...శ్రమకు వారం పాటు విరామమిచ్చి కుటుంబసభ్యులతో విహార యాత్రకు బయలుదేరారు. బంధువులను కలిసి, సూర్యలంక బీచ్‌లో స్నానాలాడి తిరిగెళ్లాలనుకున్నారు. మూడు రోజులపాటు పొన్నూరులోని బంధువులతో గడిపి పర్చూరులోని బంధువుల వద్దకు బయలుదేదారు. బాపట్ల శివారులోని నల్లమడ వాగు వద్దకు చేరుకునే సరికి భానుడు భగభగ మండిపోవడంతో సేద తీరేందుకు వాగులోకి దిగారు. అదే సమయానికి పోటు (నీళ్లు ఒక్కసారిగా పెరగడం) రూపంలో వచ్చిన మృత్యువు వీరిని కబళించి ఆ కుటుంబాలను అంతులేని విషాదంలోకి నెట్టింది. మృతులందరివీ కులాంతర వివాహాలు చేసుకున్న ఆదర్శ కుటుంబాలే. కొందరు తండ్రులను కోల్పోతే...మరికొందరు బిడ్డలను కోల్పోయి అనాథలుగా మిగిలారు. మృతుల కుటుంబసభ్యుల రోదనలతో బాపట్ల ఏరియా వైద్యశాల అట్టుడికింది. వారిని చూసి ఏరియా వైద్యశాలకు చేరుకున్న ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమవుతున్నారు. బుధవారం నల్లమడవాగు దుర్ఘటనలో మృతి చెందిన కుటుంబాల విషాద గాథ ఇది. తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జగద్గిరిగుట్ట బీరప్పనగర్‌లో నివాసం ఉండే మూడు కుటుంబాలకు చెందిన 12 మంది ఈనెల 26న హైదరాబాద్ నుంచి బయలుదేరి 27న పొన్నూరు చేరుకున్నారు. 28, 29 పొన్నూరు మండలం వడ్డిముక్కల, మునిపల్లె గ్రామాల్లోని బంధువుల ఇంట్లో గడిపారు. పర్చూరు మండలం వీరన్నపాలెంలో నివాసం ఉంటున్న మరొక బంధువు వద్దకు వెళ్తుండగా నల్లమడ వాగులో దుర్ఘటన జరిగి నలుగురు గల్లంతైన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో బుధవారం రాత్రి దొరబడి సునీల్‌కుమార్ (36), అతని కుమారుడు అనురాజ్ (13) మృతదేహాలు లభ్యమయ్యాయి. కిరణ్‌గౌడ్ (35), బండా నందు (35)ల మృతదేహాలు గురువారం లభ్యమయ్యాయి. మృతదేహాలను ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆదర్శ కుటుంబాలు

నల్లమడ వాగు దుర్ఘటనలో మృతిచెందిన వ్యక్తులు మూడు కుటుంబాలు, మూడు సామాజిక వర్గాలకు చెందిన వారు. వీరు పద్మశాలి, ఎస్సీ(మాల), గౌడ్ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులు. కొన్నేళ్లుగా వీరంతా హైదరాబాద్‌లో కలిసి మెలసి ఉంటున్నారు. ఒకే సామాజిక వర్గం కాకపోయినా, ఆచార వ్యవహారాలు వేరైనా కలిసి జీవించాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఈ మూడు సామాజిక వర్గాలకు చెందిన ముగ్గురు కులాలకతీతంగా వివాహాలు చేసుకొని హైదరాబాద్‌లోని జగదీర్‌గుట్టలో జీవనం సాగిస్తున్నారు. జీవిత పోరాటంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న వీరు నల్లమడవాగు నీటిలో మృత్యువాత పడ్డారు.

నా ఇంటి దీపం ఆరిపోయింది

దొరబడి కోటేశ్వరి, సునీల్‌కుమార్ భార్య



తల్లడిల్లిపోతున్న సునీల్‌కుమార్ చెల్లి, భార్య

దేవుడా నీకు నేను ఏం అన్యాయం చేశాను. నా భర్తతోపాటు నా కొడుకును కూడా తీసుకెళ్లి నా ఇంటి దీపాన్ని ఆర్పేశావు అంటూ సునీల్‌కుమార్ భార్య కోటేశ్వరి రోధిస్తున్న తీరు ఏరియా వైద్యశాలకు చేరుకున్న ప్రజలను కలచివేస్తుంది. సునీల్‌కుమార్ బాపట్లలోని క్రిష్టియన్‌పేటకు చెందిన వ్యక్తి. హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. సునీల్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. సునీల్‌కు ఇద్దరు చెల్లెళ్లు, ఒక తమ్ముడు ఉన్నారు. తల్లిదండ్రులు చనిపోయిన తర్వాత ప్రేమలత అనే చెల్లికి వివాహం చేశారు. తల్లిదండ్రులు కోల్పోయిన తర్వాత అమ్మ...నాన్నను నీలోనే చూసుకుంటూ పెరిగాను. నాకు నీవు కూడా దూరమయ్యావా అన్నయ్యా అంటూ చెల్లి ప్రేమలత రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తుంది.

కళ్లెదుటే కొట్టుకుపోయారు : బండా కృష్ణ దంపతులు

మూడు కుటుంబాలకు చెందిన మేము 12 మంది వాహనంలో హైదరాబాద్ నుంచి ఈనెల 26న బయలుదేవి 27న పొన్నూరులోని వడ్డిముక్కల గ్రామానికి వచ్చాం. 28న మునిపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లాం. 29న పర్చూరులోని వీరన్నపాలెం వెళ్లేందుకు బయలుదేరాం. అంతా సవ్యంగా జరిగి ఉంటే బుధవారం వీరన్నపాలెంలో గడిపి 29 తెల్లవారుజామున 4 గంటలకు సూర్యలంక సముద్రతీరానికి చేరుకొని తీరంలో సాయంత్రం వరకు గడిపి రాత్రికి బయలుదేరి శుక్రవారం ఉదయానికి హైదరాబాద్ వెళ్లేవాళ్లం. మేము అప్పికట్ల దాటిన తర్వాత చెట్టు క్రింద కూర్చొని ఉన్నాం. మా బంధువులు కాలువలో దిగారు. మేము చూస్తుండగానే నిమిషాల వ్యవధిలోనే ఒకరి తర్వాత ఒకరు నలుగురు కాలువలో కొట్టుకుపోయారు. కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా నా వల్ల కాలేదు. కళ్లముందే కొట్టుకుపోయారు.

నేను పోయింటే బాగుండు : నందు భార్య లక్ష్మి



నా భర్త బతికుండి నేను చనిపోయింటే బాగుండేది. దివ్యాంగురాలినైన నన్ను నా భర్త ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కార్ డ్రైవర్ అయినప్పటికీ ఎంతో ఆప్యాయంగా చూసుకుంటాడు. నాకు మోక్షిత్, వశిష్ట అనే ఇద్దరు పిల్లలున్నారు. ఇప్పటికీ నా భర్తకు ఎలాంటి దుర అలవాట్లు లేవు. తాను కష్టపడి పిల్లలను మంచిగా చదివిస్తున్నాడు. ఇప్పుడు వీళ్లను ఎలా పెంచాలి...వీళ్ల భవిష్యత్ గురించి తలుచుకుంటేనే భయమేస్తోంది. దేవుడికి కూడా న్యాయం లేదు. నా భర్త బదులు నన్ను తీసుకెళ్లలేకపోయినావా దేవుడా నేను నీకు ఏం పాపం చేశానంటూ నందు భార్య విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తుంది.

మాకు దిక్కెవరు : కిరణ్‌గౌడ్ కుటుంబసభ్యులు

మా కుటుంబంలో ఉన్న ఉన్న ఒక్కగానొక్క మగబిడ్డ కిరణ్‌గౌడ్ ఆయన్ను కూడా బలితీసుకున్నావా దేవుడా అంటూ కిరణ్‌గౌడ్ తల్లి పద్మ. నాకు తలకొరివి పెడ్తాడనుకుంటే నాతోనే కొరివి పెట్టించుకుంటున్నావా....నా బిడ్డను బతికించి నన్ను తీసుకెళ్లు దేవుడా అంటూ కిరణ్ తండ్రి ఏల్లేశ్‌గౌడ్, ఈ ఇద్దరు ఆడపిల్లలను నేను ఏం చేయాలి, వీళ్ల భవిష్యత్ ఏంటి, బీచ్‌కెళ్లి వస్తానని చెప్పి శవమై కనిపించావా... నేను ఎలా బతకాలి బావ అంటూ భార్య లక్ష్మి, మా నాన్నకు ఏమైందమ్మా, నాన్న పలకడం లేదు ఏంటి, నాన్నను లేపండి... నాన్న... నాన్న అంటూ కిరణ్ మృతదేహం వద్ద బిడ్డలు పిలుస్తున్న తీరు అక్కడకు చేరుకున్న ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తుంది. కారు డ్రైవర్‌గా జీవనం సాగించే కిరణ్ అమ్మనాన్నతోపాటు చెల్లి రేవతి, భార్య పిల్లలకు ఏ అవసరమొచ్చినా తీర్చేవాడని, రేపటి నుంచి మాకు దిక్కెవరంటూ కుటుంబసభ్యులు రోధించడం అందరినీ కలచివేస్తుంది.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

- రెడ్‌జోన్ పరిధిలో డ్రోన్‌లు ఎగురవేయటం నిషేధం
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ ప్రక్రియ జరగాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో రెడ్‌జోన్‌గా పరిగణిస్తూ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఆ ప్రదేశాల్లో ప్రైవేటు వ్యక్తులు, వివిధ రాజకీయపార్టీలకు చెందిన వారు, ఇతరులు డ్రోన్లు ఎగరవేయటం నిషేధమన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి డ్రోన్‌లు ఎగరవేస్తే వాటిని సీజ్ చేయటంతోపాటు ఎగురవేసిన వ్యక్తుల మీద క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు జిల్లా ప్రజలు, రాజకీయ నాయకులు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.

సామాజిక మాధ్యమాలపై నిఘా

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్ బుక్, ఇన్‌స్టాగ్రాం గ్రూపుల్లో రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు పోస్టులు చేస్తే గ్రూప్ అడ్మిన్‌దే పూర్తి బాధ్యత అని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఐటీ కోర్ విభాగంలో నిష్ణాతులైన పోలీస్ అధికారుల తో సామాజిక మాధ్యమాలపై నిఘా ఏర్పాటుచేశామన్నారు. ఎగ్జిట్ పోల్స్ విడుదల కానున్న నేపథ్యంలో సామాజిక మాధ్యమాలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిట్ పోల్స్ విడుదలైన తరువాత సోషల్ మీడియాలో ప్రజలను, ఇతర రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలను, అభ్యర్థులను రెచ్చ గొట్టే విధంగా సందేశాలు, ఫొటోలు పోస్టు చేయరాదన్నారు. సామాజిక మాధ్యమాలలో అభ్యంతరకర, రెచ్చగొట్టే విధంగా సందేశాలు, ఫొటోలు ఎవరైనా పోస్ట్ చేస్తే వెంటనే స్థానిక పోలీసులకు, బాపట్ల జిల్లా ఎస్పీ హెల్ప్ లైన్ నెంబర్ 8333813228కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

వ్యవసాయ కళాశాల ఎన్నో జ్ఞాపకాలను ఇచ్చింది

రిటైర్డు ఐఏఎస్ అధికారి అయ్యంగార్




సభలో మాట్లాడుతున్న రిటైర్డు ఐఏఎస్ అధికారి అయ్యంగార్

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో విద్యనభ్యసించిన అనంతరం విద్యార్థులు ఉద్యోగార్థం విదేశాలకు వెళ్లి స్థిరపడినా ఈ ఊరితో ఆ విద్యార్థులకు అనుబంధం ఏనాటికి చెక్కుచెదరదని, ఇక్కడి విద్యా విషయక జ్ఞానపరిమళాలు విద్యార్థులకు నేర్పించే ఉత్తమ సంస్కారం అందుకు కారణమని రిటైర్డు ఐఏఎస్ అధికారి, త్రిపుర ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కళాశాల పూర్వ విద్యార్థి డాక్టర్ జి.ఎస్.జి.అయ్యంగార్ అన్నారు. వ్యవసాయ కళాశాల 79వ వార్షికోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కళాశాలలో విద్యనభ్యసించిన అనేక మంది వివిధ రాష్ట్రాలలో ఐఏఎస్‌లుగాను, శాస్త్రవేత్తలుగాను రాణిస్తున్నారని, ఇక్కడి అధ్యాపకుల నాణ్యమైన బోధన, వారు నిర్వహించే విలువలతో కూడిన క్రమశిక్షణా విధానాల ద్వారా విద్యార్థులు అటువంటి లక్ష్యాలను చేరుకోగలుగుతున్నారన్నారు. ప్రస్తుతం విద్యార్థుల కంటే విద్యార్థినులు అధిక సంఖ్యలో వ్యవసాయ విద్య పట్ల మొగ్గు చూపడం శుభపరిణామమన్నారు. బాపట్ల కళాశాల ఆ ఘనతను సాధించి ఇతర కళాశాలలకు ఆదర్శనీయంగా నిలిచిందన్నారు. విద్యానంతరం పట్టాలు పుచ్చుకుని వెళ్లిన పూర్వ విద్యార్థులు తమకు ఉన్నత విద్యను అందించిన తమ కళాశాల పట్ల కృతజ్ఞతాభావనతో ఉండాలని సూచించారు. తమ వంతు సేవను కూడా ఈ కళాశాలకు అందించాలని ఆయన కోరారు. కళాశాల పూర్వ విద్యార్థిగా కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారాన్ని ఎప్పుడూ అందిస్తూనే ఉంటానని చెప్పారు. విద్యార్థుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని వసతి గృహాల ఏర్పాటులో పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. సభకు అధ్యక్షత వహించిన డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కరుణ సాగర్ విద్యలోనే కాక క్రీడల్లోనూ, సాహిత్య సాంస్కృతిక పోటీల్లోనూ కళాశాల ఉన్నత స్థాయి చేరుకోవడాన్ని అభినందిస్తూ ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ కెరీర్ పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు కళాశాల అభివృద్ధి నివేదికను సమర్పిస్తూ 74 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన ఈ కళాశాల ద్వారా రూ.4.4 కోట్ల ఆర్థిక సహాయం విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ రూపంలో అందజేయబడ్డాయని తెలిపారు. డీన్ ఆఫ్ పి.జి. స్టడీస్ డాక్టర్ ఏ.వి.రమణ, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ టి.మధుమతి, డాక్టర్ డి.సాయిరాంకుమార్ అవార్డుతో పాటు బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ పి.వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



రేపల్లెరూరల్: న్యాయ సేవ చట్టాలపై కనీస అవగాహన ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు చెప్పారు. పట్టణంలోని సబ్‌జైల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రిమాండ్ ఖైదీలకు గురువారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చిన్న పాటి తప్పులతో నేరం ఆరోపించబడి రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు న్యాయశాఖ ఉచితంగా సేవలు అందిస్తుందన్నారు. ప్రైవేటు న్యాయవాదిని భరించలేని కక్షిదారుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన న్యాయవాది ద్వారా కోర్టులో న్యాయం పొందవచ్చన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పిదాలకు తమతోపాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులపాలు కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. దీంతో జీవితకాలం బాధలు పడాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. ఇప్పటి నుంచైనా పగ, ప్రతీకారాలను, రాగద్వేషాలను వీడి శాంతి కాముకులుగా జీవించాలని సూచించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరాతీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి విశేష పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నాల్గో రోజైన గురువారం విశేష పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి సుప్రభాత సేవ, అర్చన జరిగాయి. దేవస్థానాన్ని రకరకాల పూలతోనూ, అభయాంజనేయ స్వామిని పూలమాలలతోనూ ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు అంజనీపుత్రుడికి 1008 లిల్లీ పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక వేదికపై లక్ష్మీ గణపతి భజన సమాజం (రేమల్లే) ఆధ్వర్యంలో 108సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు చాలీసా పారాయణం చేస్తూ భక్తిపారవశ్యం పొందారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ నాటికగా 'ఇంద్రప్రస్థం'



ఇంద్రప్రస్థం నాటికకు బహుమతి ప్రదానం చేస్తున్న న్యాయ నిర్ణేతలు, శ్రీకారం, రోటరీ కళాపరిషత్ ప్రతినిధులు

- నాటికల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం
- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా కరీంనగర్ వారి 'చీకటి పువ్వు'
- ఆకట్టుకున్న నాటికలు

మార్టూరు: రాష్ట్రస్థాయి నాటికగా 'ఇంద్రప్రస్థం' నిలిచింది. మార్టూరులో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటిక పోటీల విజేతలకు బుధవారం అర్ధరాత్రి నిర్వాహకులు, న్యాయనిర్ణేతలు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం నాటిక, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు' నాటిక, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి 'కౌసల్యా సుప్రజా రామ' నాటిక, ప్రత్యేక ప్రదర్శనగా కళానికేతన్ వీరన్నపాలెం వారి 'రాజుగారి గోచి' నాటికలు పురస్కారాలు అందుకున్నాయి. ఉత్తమ నటిగా 'చీకటి పువ్వు నాటిక'కు చెందిన గుడివాడ లహరి, ఉత్తమ నటుడిగా 'నిశ్శబ్దమా నీఖరీదెంత' నాటిక నుంచి సీసీ వరప్రసాద్, ఉత్తమ విలన్‌గా 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటికకు చెందిన మహిళా ఆర్టిస్ట్ హేమ బహుమతి అందుకోవడం విశేషం. ఉత్తమ హాస్యనటుడిగా కళానికేతన్ వీరన్నపాలెం వారి రాజుగారిగోచి నాటికలోని నటుడు గోరంట్ల సురేంద్ర, ఉత్తమ క్యారెక్టరు యాక్టర్‌గా ఇంద్రప్రస్థం నాటికకు చెందిన కుసుమ సాయిలతో పాటు ఇతర రంగాలకు చెందిన పలువురికి బహుమతి ప్రదానం చేశారు. నాటికల పోటీలకు న్యాయనిర్ణేతలుగా డాక్టర్ గోవాడ వెంకట్, అంబటి మురళీకృష్ణ, డాక్టర్ ఎమ్ఎస్ చౌదరిలు వ్యవహరించారు. కార్యక్రమంలో శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ జేవీ మోహనరావు, అధ్యక్షుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, మార్టూరు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు



మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్.మురళీకృష్ణ

బాపట్లటౌన్: ఎన్నికల కౌంటింగ్ రోజు అభ్యర్థు లు, ఏజెంట్లు నిబంధనలు పాటించాలని డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ తెలిపారు. బాపట్ల డీఎస్పీ కార్యాలయంలో గురువారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ రోజున బాపట్లటౌన్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నందున ఎటువంటి వాహనాలు బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ మీ దుగా టౌన్ లోనికి అనుమతించబడవన్నారు. చీరాల నుంచి బాపట్ల వైపు వచ్చే వాహనాలు జాతీయరహదారి 216 మీదుగా సూర్యాలంక రోడ్డులో నుంచి బాపట్లలోకి రావాలన్నారు. కర్లపాలెం నుంచి చీరాల వైపు వెళ్లు వాహనాలు జాతీయ రహదారి 216 మీదుగా వెళ్లాలని, గుంటూరు నుంచి చీరాల వైపు వెళ్లే వాహనాలు చీలు రోడ్డు నుంచి మార్కెట్ యార్డ్ మీదుగా జాతీయ రహదారికు వెళ్లాలని, బాపట్ల గడియారస్తంభం మీదుగా సూర్యలంక రోడ్డులో జాతీయ రహదారి నుండైనా వెళ్లవచ్చన్నారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అభ్యర్థులు కమ్మ కల్యాణమండపం పక్కన, దాని ఎదురుగా ఉన్న రెండు ప్రదేశాల్లో వాహనాలు నిలుపుదలచేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రానికి వచ్చే అధికారులు, సిబ్బందికి (పోలీసు, రెవెన్యూ) విలియంబూత్ కాలేజీ వద్ద పార్కింగ్ ప్రదేశం కేటాయించినట్లు తెలిపారు. పర్చూరు, చీరాల, అద్దంకి వైపు నుంచి వచ్చు టీడీపీ, మిత్రపక్షాల ఏజెంట్లకు జాతీయ రహదారి 216 వై జంక్షన్ పక్కనే ఉన్న రాయల్ మెరైన్ కంపెనీ పక్కన, వైఎస్సార్ సీపీ, ఇండిపెండెంట్ ఏజెంట్లు డఫ్ అండ్ డెమ్ స్కూల్ దగ్గర పార్కింగ్ చేయాలన్నారు. రేపల్లె, వేమూ రు, బాపట్ల వైపు నుంచి వచ్చే టీడీపీ, మిత్రపక్షాలు, ఇండిపెండెంట్ ఏజెంట్లకు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల వెనుక వైపు సుబ్బారెడ్డిపాలెం రోడ్ వద్ద గల పార్కింగ్ ప్రదేశం కేటాయించినట్లు తెలిపారు. రేపల్లె, వేమూరు, బాపట్ల వైపు నుంచి వచ్చే వైఎస్సార్ సీపీ ఏజెంట్లకు జాతీయరహదారి 216 నుంచి నాగేంద్రపురం వెళ్లే రోడ్డు పక్కన, ఇతరులు సుబ్బారెడ్డి పాలెం రోడ్ ప్రక్కన పార్కింగ్ చేయాలన్నారు.

క్లుప్తంగా

పిల్లల్లో ఆర్థోపెడిక్ లోపాలకు జూన్ 3న కోత, కుట్లు లేని చికిత్స

గుంటూరు మెడికల్: చిన్నపిల్లల్లో వంకర కాళ్ల లోపాలను సరిచేసేందుకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో జూన్ 3న ఆర్థో పెడిక్ ఓపీ విభాగం ఆధ్వర్యంలో కోత, కుట్లు లేకుండా ఉచిత చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్యూర్ ఇండియా సౌజన్యంతో చేపట్టిన ఈ ఉచిత వైద్య శిబిర పోస్టర్‌ను గురువారం ఆస్పత్రి ఆర్థోపెడిక్ ఓపీలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో తిరిగి కాళ్ళు వంకరగా ఉన్న పిల్లలను గుర్తించి గుంటూరు జీజీహెచ్ ఆర్థో విభాగానికి తీసుకు వచ్చి చికిత్స చేయించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. వంకర పాదంతో పుట్టిన పిల్లలు వెంటనే చికిత్స చేస్తే దివ్యాంగులు కాకుండా ఉంటారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్థో పెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశశ్వి రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

కొల్లి శారదా మార్కెట్‌లోని షాపుల స్వాధీనానికి నోటీసులు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లి శారదా హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో ఉన్న షాపుల లీజు కాలపరిమితి ముగియడంతో షాపుల స్వాధీనానికి నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. 1999లో నగరపాలక సంస్థ 88 షాపులతో కొల్లి శారదా కూరగాయల మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించింది. 25 ఏళ్ల లీజు గడువుతో షాపులను కొంత మంది దక్కించుకున్నారు. వీటిలో 25 ఏళ్ల లీజు గడువు పూర్తయిన 81 షాపులను నగరపాలక సంస్థకు అప్పగించాలని నోటీసులు జారీ చేశారు. 7 రోజుల్లో షాపులను అప్పగించని పక్షంలో దుకాణాలకు తాళాలు వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మిగిలిన 7 షాపులకు 2027 దాకా లీజు గడువు ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా మేకల సుబ్బారావు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్–1938) రాష్ట్ర కార్యదర్శిగా గుంటూరు నగరానికి చెందిన మేకల సుబ్బారావు ఎన్నికయ్యారు. కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన సంఘ రాష్ట్ర నూతన కౌన్సిల్ సమావేశంలో భాగంగా మేకల సుబ్బారావును రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెలంగి బీరాజు, కట్టిబోయిన నరసింహారావు గురువారం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశేష సేవలు అందిస్తున్న సుబ్బారావు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల సీనియర్ నాయకులు ఏవీ రామారావు, విజయానంద్, గౌరవాధ్యక్షుడు సూర్యప్రకాశరావు, మాజీ అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్ అభినందనలు తెలిపారు.

భాషాసంస్కృతుల పరిరక్షణే ధ్యేయం



అధ్యాపకులు, ఉపాధ్యాయులను సత్కరించిన బాపయ్యచౌదరి, రామినేని సత్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు



చల్లపల్లికి చెందిన చాట్రగడ్డ శ్రీనివాస్ బృందం డప్పుల ప్రదర్శన

- ఉత్తర అమెరికా తెలుగు సంఘు (నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి
- నాట్స్ ఆధ్వర్యంలో జానపద, సాంస్కృతిక సంబరాలు
- ఏపీ, తెలంగాణ నుంచి తరలివచ్చిన కళాకారులు
- కళాకారులు, కవులు, ఉపాధ్యాయులకు సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: భాషాసంస్కృతుల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘు (నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి పేర్కొన్నారు. నాట్స్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జానపద, సాంస్కృతిక సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పెదనందిపాడు గ్రామానికి చెందిన తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి అంచెలంచెలుగా ఎదిగి అమెరికాలోని నాట్స్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్నానని వివరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణకు నాంది పలుకుతూ సేవే రమ్యం–భాషే గమ్యం నినాదంతో నాట్స్ ముందుకు వెళుతోందని చెప్పారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో మరుగున పడిన జానపద కళలు, కళాకారులు, సాహిత్యకారులను వెలుగులోకి తీసుకురావాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణ నుంచి వచ్చిన కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలిచ్చారని కొనియాడారు. అమెరికాకు వస్తున్న తెలుగు ప్రజలకు నాట్స్ ఆధ్వర్యంలో అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తున్నట్లు చెప్పారు. మరుగున పడిపోతున్న కళాకారులను గుర్తించి వారికి సముచిత గౌరవం కల్పించడంతోపాటు ఉపాధ్యాయుల సేవలను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మూలాలను మరువకుండా నాట్స్ అధ్యక్షుడు బాపయ్యచౌదరి సహృదయంతో ఏర్పాటు చేసిన జానపద–సాంస్కృతిక సంబరాలలో తాము భాగస్వాములమయ్యామని చెప్పారు. జానపద కళారూపాలను పరిరక్షించి, కళాకారులకు చేయూత అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ప్రముఖ రచయిత, గాయకుడు చింతల యాదగిరితోపాటు బుర్రకథ పితామహుడు నాజర్ తనయుడు బాపూజీ, సినీ, నాటక రంగ నటుడు కృష్ణేశ్వరరరావు, ప్రముఖ ప్రజా గాయకులు రంగం రాజేష్, రమణను సత్కరించారు. అదే విధంగా డాక్టర్ రావి అరుణ, డాక్టర్ శ్రీలత, పీవీ మల్లేశ్వర్, పాటిబండ్ల విష్ణువర్ధన్, కన్న మాస్టారు సహా 25 మంది అధ్యాపక, ఉపాధ్యాయులను సత్కరించారు.

అద్భుతమైన ప్రదర్శనలు

కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. సూర్యాపేటకు చెందిన సంధ్య జానపద గాన ప్రదర్శన, చింతూరుకు చెందిన కొమ్ముబుర్ర కళాకారుల ప్రదర్శన, చింతల యాదగిరి తనయథామిని గుర్రం జాషువా పద్య ఆలాపన, రంగ రాజేష్ అమ్మపాట, లెనీనా తెలుగు పాట, చల్లపల్లికి చెందిన చాట్రగడ్డ శ్రీనివాస్ బృందం డప్పుతో గాన ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాట్స్ డల్లాస్ ప్రతినిధి రామినేని సత్య, బాపయ్యచౌదరి తల్లిదండ్రులు సీతాదేవి, సుబ్బారావు, కార్యక్రమ నిర్వహణ సభ్యులు దాసరి శివ, దాసరి వెంకట సుబ్బారావు, కాకుమాను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తమ్ముడిని చంపిన అన్న అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌ఓ దేవప్రభాకర్, వెనుక నిందితుడు

గుంటూరు ఈస్ట్: తమ్ముడిని హత్య చేసిన ఘటనలో అన్నను లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ దేవ ప్రభాకర్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 26న సంగడిగుంటలో అర్వపల్లి దుర్గారావు తన కుమార్తె జన్మదిన వేడుకలు చేసుకుంటున్నాడు. అదే సమయంలో తమ్ముడు సాంబయ్య అన్న వద్దకు వచ్చి మద్యానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దుర్గారావు నిరాకరించడంతో సాంబయ్య ఘర్షణ పడ్డాడు. సాంబయ్య కర్రతో అన్న దుర్గారావును కొట్టాడు. దుర్గారావు కోపంతో సాంబయ్య చేతిలో కర్రను లాక్కొని సాంబయ్య తలపై గట్టిగా మోదాడు. సాంబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు దుర్గారావును గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- గ్రామాలలో ప్రశాంతతకు విస్తృత బందోబస్తు
- కౌంటింగ్ అనంతరం 144 సెక్షన్ అమలు
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ చెప్పారు. గురువారం పలు పార్టీల అభ్యర్థుల ప్రతినిధులు, పోలీసు అధికారులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న నరసరావుపేటలో జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థులు, ప్రతినిధులకు సూచనలు, మార్గదర్శకాలను వివరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ, గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 1న పింఛన్ల పంపిణీకి సంబంధించి ఎంపీడీఓలు, తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి కె వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మంజునాధ రెడ్డి, సీఐలు బ్రహ్మయ్య, సురేష్, ఎంపీడీఓ సరోజనీదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాసు, డీటీ షేక్ బాషా, శర్మ, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

జూన్ 5వరకు దుకాణాలు మూసేయండి

నరసరావుపేట: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు జూన్ 2, 3, 4, 5 తేదీల్లో షాపులు మూసివేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి గాదంశెట్టి రామకృష్ణ వ్యాపారస్తులను కోరారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జరిగిన అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో పెట్టుకొని గురువారం ఎస్పీని జిల్లా కార్యాలయంలో కలవటం జరిగిందన్నారు. వ్యాపారస్తులు ఒకటో తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని కోరారన్నారు. కావున జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారస్తులు షాపులు మూసివేసి పోలీసులకు సహకరించాలని కోరారని వారు తెలిపారు.

టీబీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించండి

రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్

తాడేపల్లి రూరల్: టీబీ వ్యాక్సినేషన్ గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ చెప్పారు. దుగ్గిరాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వయోజనుల టీబీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ముందుగా రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి, గత 5 సంవత్సరాల్లో టీబీ వ్యాధి సోకి తగ్గిపోయిన వారికి, టీబీ రోగులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నవారికి, పొగతాగేవారికి, షుగర్ వ్యాధి ఉన్నవారికి టీకా వేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సి.ఇందిర, సీహెచ్‌ఓ జానమ్మ, టీబీ సూపర్‌వైజర్ రవికుమార్, ఆరోగ్య కార్యకర్తలు లీలాకుమారి, జె.శ్యామల, శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వృక్ష విలాపం



అమరావతి-గుంటూరు రహదారిలో కాలిపడిపోయిన చింత చెట్లు

- ఆకతాయిలు, రియల్టర్ల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు
- నిలువ నీడ లేక అల్లాడుతున్న ప్రజలు



అమరావతి: గుంటూరు–అమరావతి మార్గంలో వందల ఏళ్ల నాటి చింత చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వందల ఏళ్ల కిందట నాటిన మొక్కలు మహా వృక్షాలుగా పెరిగాయి. బాటసారులు, రైతులు, కూలీలు ఎండ, వానల నుంచి సేద తీరేవారు. అంతేకాక ప్రతి సంవత్సరం చింత చెట్ల ఫలసాయంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా లభించేది. ఒక్కొక్కటి ఉనికిని కోల్పోతున్నాయి. ఆకతాయిల ఆగడాల వల్ల కొంతమేర చెట్లు తగలబడిపోగా, ఇటీవల రియల్ ఎస్టేట్ వెంచర్లు ముందున్న చింత చెట్లకు రాత్రికి రాత్రే నిప్పంటుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో చెట్ల సంఖ్య తరిగిపోతూ వస్తుంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు, పోలీసు శాఖ సహాయంతో రహదారి వెంట నిఘా ఏర్పాటుచేసి పచ్చని చెట్లకు నిప్పుపెట్టే ఆకతాయిలను, రాత్రికి రాత్రే చెట్లను ముక్కలుగా కోసి అమ్ముకునే వారిని కట్టడిచేసి, చెట్లను కాపాడి పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

హత్య కేసులో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్, ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి, వెనుక నిందితులు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని హత్య చేసిన నలుగురిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ కె.వి.మహేష్, ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. వసంతరాయపురానికి చెందిన చిలుకా రాజు బాలికను ప్రేమపేరుతో వంచించిన పోక్సో కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. బాలిక కుటుంబ సభ్యులు చిలుకా రాజును హత్య చేసేందుకు బ్యాంకు కాలనీకి చెందిన కంచర్ల దేవానందంకు భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చినట్లు చిలుకా రాజుకు సమాచారం తెలిసింది. దీంతో రాజు అనుమానంతో దేవానందంపై కక్ష పెంచుకున్నాడు. దేవానందం హత్యకు పథకం వేశాడు. అతని స్నేహితులు చింతగుండ్ల ప్రవీణ్, కూకట్లపల్లి సందీప్, పల్లె రాజుల సహాయం కోరాడు. హత్యకు ఆన్‌లైన్‌లో కత్తులు కొనుగోలు చేశాడు. దేవానందంను హత్య చేసేందుకు అవకాశం ఎదురు చూశాడు. ఈనెల 22వ తేదీ దేవానందం మద్యం తాగుదామని నిందితులైన నలుగురిని పిలిచాడు. అందరూ కలిసి దేవానందం కారులో బార్‌కు వెళ్లి మద్యం తాగారు. అనంతరం అందరూ కారులో రాజీవ్‌గాంధీనగర్ మెయిన్ రోడ్డు వద్ద కారు ఆపారు. దేవానందం మూత్ర విసర్జన కోసం వెళ్లగా నిందితులు నలుగురు కత్తులతో దాడిచేసి విచక్షణా రహితంగా పొడిచారు. దేవానందం ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం చిలుకారాజు, చింతగుంట్ల ప్రవీణ్, కూకట్లపల్లి సందీప్, పల్లె రాజులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించేందుకు కృషి చేసిన ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరెడ్డి, ఎస్సై టి.నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు అశోక్‌చక్రవర్తి, ఉదయ్‌చంద్, అప్పలనాయుడులను డీఎస్పీ మహేష్ అభినందించారు.

చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించేలా జగన్ పరిపాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

వెల్దుర్తి: రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన సాగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. గురువారం పల్నాడు జిల్లా శ్రీరాంపురంతండాలో ఆయన మాట్లాడుతూ 2019లో 151 శాసనసభ స్థానాలు, 22 లోక్ సభ స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిచి మే 30న సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసి ఐదేళ్లలో ప్రజలు అభివృద్ధి చెందేలా పాలన చేశారన్నారు. ఆనాడు జగన్ చెప్పిన విధంగా మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. రాష్ట్ర రూపురేఖలు మార్చేందుకు మరోమారు వైఎస్సార్ సీపీ చారిత్రక విజయం సాధించటం ఖాయమన్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో వైఎస్సార్ సీపీ అధిక శాసనసభ స్థానాలు కైవసం చేసుకుంటుందన్నారు. సీఎం జగన్ మరోమారు అధికారం చేపట్టనున్నారన్నారు.

యువతి వెంట పడుతున్న వ్యక్తిపై కేసు

ప్రత్తిపాడు: వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్న వ్యక్తి ఓ అవివాహిత వెంట పడి ట్రాప్ చేస్తుండడంతో అతడిపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ సోమేశ్వరరావు కథనం ప్రకారం.. తుమ్మలపాలెం గ్రామానికి చెందిన ఓ యువతి గుంటూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన మామిడి ఆనంద్ అనే వ్యక్తి కొంత కాలంగా యువతి వెంటపడుతూ ఆమెను ట్రాప్ చేశాడు. దీంతో మూడు నెలల నుంచి యువతి ఇంటికి రాకుండా గుంటూరులోనే నివాసం ఉంటుంది. ఇదే విషయమై యువతి తల్లిదండ్రులు ఆనంద్‌ను ప్రశ్నించారు. అతను వారిని అసభ్యంగా తిడుతూ, రోడ్డు మీదకు ఈడుస్తానని బెదిరించాడు. దీంతో ఆనంద్ వల్ల తమతోపాటు తమ కుమార్తెకు ప్రాణహాని ఉందని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆనంద్‌పై కేసు నమోదు చేశారు. యువతిని పోలీసులు గుంటూరు మహిళా ప్రాంగణంలో చేర్పించారు. కాగా ఆనంద్‌కు ఇప్పటికే వివాహమైంది. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రకృతి సేద్యానికి రైతులు ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనంతు లక్ష్మణాచారి

భట్టిప్రోలు: ప్రకృతి సేద్యానికి రైతులు ముందుకు రావాలని డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనంతు లక్ష్మణాచారి కోరారు. ప్రకృతి వ్యవసాయ విభాగం, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణాచారి ప్రీమాన్ సూన్ డ్రైసోయింగ్ (పీఎండీఎస్)లో భాగంగా 30 రకాల విత్తనాలను తొలకరి జల్లులు పడుటకు ముందుగా వ్యవసాయ భూముల్లో చల్లి 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నుట ద్వారా భూసారాన్ని పెంచవచ్చునని తెలిపారు. సేంద్రియ కిట్ల తయారీ, దేశవాళి ఆవుల కొనుగోలు, ఎన్‌పీఎం దుకాణాల ఏర్పాటుకు స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యల ద్వారా రుణాలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీసీపీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం జె.మోహన్, ఎన్ఎఫ్ఎ శ్రీవల్లి, క్లస్టర్ కో–ఆర్డినేటర్లు, మండల సమాఖ్య ఈసీ సభ్యులు, ఎంటీ బాలపాప పాల్గొన్నారు.

కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



వెల్లటూరు(భట్టిప్రోలు): ఎదురుగా స్పీడ్ బ్రేకర్‌ను గమనించకపోవడంతో ఓ కారు కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న తండ్రీకూతుళ్లకు గాయాలయ్యాయి. భట్టిప్రోలు మండలం వెల్లటూరు బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. భట్టిప్రోలు వైపు నుంచి వస్తున్న కారు కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. కూరగాయలు చెల్లా చెదురయ్యాయి. ఆ పక్కనే కూల్‌డ్రింక్ షాప్ వద్ద ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న తండ్రీకూతుళ్లను ఢీకొట్టింది. వారికి గాయాలయ్యాయి. వారి పూర్తి వివరాలు తెలియరాలేదు. క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.